

వణికిస్తున్న చలి

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని గత 20 రోజులుగా చలి తీవ్రత ఎక్కువైంది. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చల్లటి గాలులు వీస్తున్నాయి. ఉదయం సాయంత్రం సమయంలో ఎత్తైన కొండ కోనలు, నివాస గ్రామాలను పొగమంచు కమ్మేస్తుండటంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గిరిజనులు రాత్రిలు, ఉదయం సమయంలో ఇళ్లల్లో లేదా బయట చలిమంట కుంపటి వేసుకుని మంటలు కాగుతున్నారు. తెల్లవారు వేకువ జామున వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. స్వెట్టర్లు, మంకీ కేపులు, రగ్గులు వంటి దుస్తులను ధరిస్తున్నారు.



కమ్మేసిన పొగ మంచు

సమస్యలు పరిష్కరించాలని.. వీఆర్ఎల నిరసన



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)లు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని కోరుతూ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం సిఐటియూ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరాజీ అప్పారావు అధ్యక్షతన అరకులోయ తహశీల్దార్ కార్యాలయం ఎదుట అరకులోయ, డుంబ్రిగుడ వీఆర్ఎలు ఒకరోజు నిరహార దీక్ష చేపట్టారు. తమ న్యాయ పరమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కారం చేయాలని వారు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, వీఆర్ఎలు గ్రామ స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నా, ప్రభుత్వం మాత్రం వారికి రావాల్సిన అవకాశాలు, హక్కులు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వీఆర్ఎలను వీఆర్వోగా పదోన్నతులు కల్పించాలని, సరైన పే స్కేల్ అమలు చేయాలని, కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని, నామినీ వి.ఆర్.ఎలకు వీఆర్ఎలుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు.పోరాటం ద్వారానే వీఆర్ఎల సమస్యలు పరిష్కారం అవుతాయని, ప్రభుత్వం పట్టించుకునే వరకు ఉద్యమం చేయాలని వీఆర్ఎలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి కిల్లో మోస్య, శెట్టి సోనాలి, మామిడి వెంకటరావు, కిల్లో సరోజినీ, వి.హరి, ఆనంద్, మొత్తి, మాలతి పాల్గొన్నారు.

వీఆర్ఎలకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్

తాసిల్దార్ కి మెమోరన ఇస్తున్న తలారిలు నాయకులు

హుకుంపేట:మండల గ్రామసేవకుల సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్ఎలు (గ్రామసేవకులు) స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామసేవకుల సంఘం జిల్లా కమిటీ (సీఐటీయూ అనుబంధం) పిలుపు మేరకు ఈ ధర్నా చేశామని మండల అధ్యక్షుడు తలారి రాంబాబు, గౌరవాధ్యక్షుడు ముట్టెంగి మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శులు టికృష్ణారావు, వి.లక్ష్మణరావు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతూ, వీఆర్ఎల జాబ్‌చార్ట్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. చాలీచాలని వేతనాలతో వీఆర్ఎలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున పే స్కేలు అమలు చేసి వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.అర్హులైన వీఆర్ఎలకు వీఆర్వో, రికార్డు అసిస్టెంట్, అటెండర్, నైట్ వాచ్‌మన్ పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఎల సంఘ నాయకులు కే.స్వరూప, జె. శివ, కే.వరూధిని, ఎస్.లక్ష్మి, ఆర్.ధనలక్ష్మి, ఎస్.సుభద్ర పాల్గొన్నారు.

వీఆర్ పురం : రెవిన్యూ శాఖలో దీర్ఘకాలంగా తక్కువ వేతనంతో దిగువస్థాయి పార్ట్‌టైం ఉద్యోగులుగా పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల ప్రసాద్, సెక్రటరీ పి సీతారాములు కోరారు. గురువారం రేఖపల్లిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ సరస్వతికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, 2018లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు తమ వేతనాన్ని రూ.10,500కు పెంచి, డిఎ రూ.300ఇచ్చారన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లపాలనలో వేతనం పెంచకపోగా, డిఎను ఉపసంహరించి రికవరీ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఎల వినతిపై తహశీల్దార్ సరస్వతి స్పందిస్తూ, సమస్యను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు గడ్డం రవి, పొట్టయ్య, పోసిబాబు, శ్రీను, గంగమ్మ పాల్గొన్నారు.



హుకుంపేటలో వినతిపత్రాన్ని ఇస్తున్న వీఆర్ఎలు



వీఆర్.పురంలో వినతిపత్రాన్ని సంఘం నేతలు

కాఫీ క్రయవిక్రయాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి -పాడేరు:మన్యంలో కాఫీకి బెర్రీ బోరర్ కీటకం ఆశించిన ప్రాంతాలలోని కాఫీ క్రయ విక్రయాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఐటీడీఏ కాఫీ విభాగం ఏడి ఎల్.బొంజుబాబు, జిల్లా ఉద్యాన అధికారి కర్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెర్రీ బోరర్ ప్రభావితమైన అరకు వ్యాలీ డుంబ్రిగుడ, అనంతగిరి మండలాలలో కాఫీ కొనుగోలుదారులు, ఎన్జీవోలు, ఎఫ్‌పివోలు, కాఫీ వ్యాపారస్తులు తప్పనిసరిగా క్రయవిక్రయాలపై అనుమతి పత్రం పొందాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. లైసెన్స్ లేకుండా కాఫీ క్రయవిక్రయాలు జరిపితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. బెర్రీ బోరర్ మూలంగా కాఫీ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై షరతులు విధించడం జరిగిందని తెలిపారు.

సికిల్ సెల్ ఎనీమియాతో వెటర్నరీ అసిస్టెంట్ మృతి



ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలం చౌడుపల్లి సచివాలయం-2లో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కంకిపాటి అరుణకుమారి (28) సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆమె స్వగ్రామమైన గూడెంకొత్త వీధి మండలం, కొత్తగూడెంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విధుల్లో నిష్టగా పనిచేసే, ప్రజలతో కలిసిమెలిసి సేవలు అందించే ఉద్యోగిగా అరుణకుమారికి గ్రామస్తుల్లో మంచి గుర్తింపు ఉండేది. ఆమె మృతి చెందిన సంగతి తెలిసి సహచర ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ అధికారులు సంతాపం తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి ప్రకటించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని పశుసంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు.



పరిశీలిస్తున్న అధికారులు

చిన్నగెడ్డలో పంటల పరిశీలన

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని చిన్నగెడ్డ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్.నందు, పాడేరు ఏడీఏ పి.ప్రభాకర్ తదితరులు వలిసే పంటలను పరిశీలించారు. పంటల పెరుగుదల, పురుగుమందుల వినియోగం, నీటి యాజమాన్యం వంటి అంశాలను పరిశీలించిన అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిముడు కృష్ణమూర్తి, కూటమి నాయకులు రీమల ఆనంద్, షేక్ ఖాసింవల్లి, రైతులు మంగులు, అప్పారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని రాళ్లగడ్డ కొత్తూరు గ్రామాన్ని ప్రధాన రహదారితో అనుసంధానించే 73 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణ పనులను కూటమి నాయకులు గురువారం ప్రారంభించారు. మెయిన్ రోడ్ నుండి గ్రామం వరకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు ఈ రోడ్డు ఎంతో ప్రయోజనకరమని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గబులంగి అప్పారావు, బచ్చలి చిట్టిబాబు, కిలో సత్తిబాబు, గంగరాజు, పలువురు కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఉపాధి కల్పనకు హోం స్టేల ఏర్పాటు

డిఆర్‌డిఎ పీడీ మురళి

ప్రజాశక్తి-అరకులోయ:గిరిజనులకు ఉపాధి కల్పించడానికే హెూం స్టేలు ఏర్పాటు చేస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ మురళి అన్నారు. అరకులోయలోని వెలుగు కార్యాలయంలో గురువారం హెూం స్టే లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది టూరిజం హెూం స్టే కాదని, డి ఆర్‌డిఏ ద్వారా మహిళా సంఘాలకు ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఇల్లులు ఖాళీగా ఉన్నవారు హెూం స్టేలకు కేటాయిస్తే ఉపాధి మెరుగుపడుతుందన్నారు. అందులో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించవలసి ఉందన్నారు. డిఆర్డిఏ ద్వారా పొందిన రుణాలు వాయిదాల ప్రకారం హెూం స్టే నిర్వాహకులు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. గ్రామంలో కనీసం ఐదు నుంచి 8 హెూం స్టే లు యూనిట్‌గా కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. హెూం స్టేలో బస చేసిన టూరిస్టులకు సాంప్రదాయ వంటకాలు అందించి వాటి ద్వారా కూడా ఉపాధి పొందవచ్చునని తెలిపారు.ఇప్పటికే పూర్తి చేసుకున్న హెూమ్ స్టేలు రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి ప్రారంభించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం అరకులోయ కొండవీదిలో లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న హెూమ్ స్టేలను డిపిఎం, ఏపిఎం వెలుగు సీసీలు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వెలుగు డిపిఎం మార్టిన్, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగూడ, హుకుంపేట, మండలాల్లోని వెలుగు ఏ పి ఎంలు కృష్ణారావు, సాయిరాం, అప్పయమ్మ, సుందరమ్మ, వెలుగు సిసి ఆనంద్,లబ్ధిదారులు పాల్గొన్నారు.



గృహాన్ని పరిశీలిస్తున్న పీడీ

కడచూపునకు పడిగాపులు

- రంపచోడవరానికి చేరుకున్న మావోయిస్టుల కుటుంబీకులు
- ఆసుపత్రి ప్రాంగణంలో మిన్నంటిన రోదనలు



రంపచోడవరం ఆసుపత్రి వద్ద మావోయిస్టు కుటుంబీకుల పడిగాపులు

ప్రజాశక్తి - రంపచోడవరం


మారేడుమిల్లి ఏజెన్సీలో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన మావోయిస్టుల పోస్టుమార్టం ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. 13 మంది మావోయిస్టులు కాల్పుల్లో చనిపోగా ఇప్పటి వరకూ నలుగురి మృతదేహాలకు మాత్రమే ప్రభుత్వం పోస్టుమార్టం నిర్వహించింది. వారిలో హిడ్మా, రాజే, టెక్ శంకర్, దేవ్‌ల శవపంచనామా పూర్తయింది. తమవారిని కడసారి చూసేందుకు మావోయిస్టుల కుటుంబీకులు రంపచోడవరం ఆసుపత్రి వద్దనే పడిగాపులు కాస్తున్నారు. తమ వారు మృతిచెందిన విషయం మీడియా ద్వారా తెలుసుకుని టెక్ శంకర్, కమలేష్, జ్యోతి బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. వారంతా కన్నీరుమున్నీరయ్యారు. ఆసుపత్రి ప్రాంగణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బూటకపు ఎన్‌కౌంటర్లు

ఆసుపత్రి వద్ద అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ మాట్లాడుతూ మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగినవి బూటకపు ఎన్‌కౌంటర్లని తెలిపారు. పథకం ప్రకారమే ప్రభుత్వం ఇదంతా చేస్తోందన్నారు. హిడ్మా ఎన్‌కౌంటర్ జరిగిన గంటలోపే విజయవాడ, సామర్లకోట, ఏలూరు, కాకినాడ వంటి ప్రదేశాలలో మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారని, వారిలో హిడ్మా, దేవ్‌జీల వ్యక్తిగత బాడీగార్డులు కూడా ఉన్నారని తెలిపారు. వ్యక్తిగత బాడీగార్డులు ఎల్లప్పుడూ హిడ్మా, దేవ్‌జీలను అంటిపెట్టు కునే ఉంటారని చెప్పారు. పోలీసులు చెబుతున్న విషయాలు నమ్మశక్యంగా లేవన్నారు. జులైలో రవి, అంజులు రంపచోడవరం ఏజెన్సీలోనే కాల్పుల్లో చనిపోయారని, అది తెలిసి హిడ్మా ఇక్కడకు ఎలా వస్తాడని అన్నారు. ప్రభుత్వాలు లొంగిపోవడానికి వచ్చిన వ్యక్తులను ఇలా హత్యలు చేయడం సరికాదని అన్నారు.

24న చింతూరులో అమరవీరుల సంస్మరణ సభ

పలు గ్రామాల్లో విస్తృతప్రచారం సిపిఎం జెండా ఆవిష్కరణలు, సదస్సులు



జెండా ఆవిష్కరణలో సిపిఎం నేతలు


ప్రజాశక్తి-వీఆర్.పురం : ఈనెల 24న చింతూరులో అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఎం నేతలు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పలుగ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి, ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. రేఖపల్లి జంక్షన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, శ్రీరామ్‌గిరి గ్రామంలో జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, చొక్కానపల్లి, ముద్దులగూడెం, జీడిగుప్ప తదితర గ్రామాల్లో పార్టీ నేతలు సిపిఎం జెండాలను ఆవిష్కరించి ప్రచారాలను ప్రారంభించారు.

చొక్కనపల్లి గ్రామం శాఖ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు మాట్లాడుతూ మన్యంలో ఆదివాసీ ప్రజలపై అంతులేని దోపిడి, వెట్టిచాకిరి, దందాలు, వారపుసంతల్లో తునినాకు ఇతర అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు కాకుండా దళారుల దోపిడి, పోలీసులు, ఫారెస్టు, రెవెన్యూ ప్రభుత్వ శాఖల దౌర్జన్యాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్వాడీ సెంటర్లు, తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి కనీస మౌలిక వసతుల కల్పనకు ఎర్రజెండా నీడన ఉద్యమాలు, పోరాటాలు, తిరుగుబాట్లు చేసే క్రమంలో ఎందరో అమరులయ్యారన్నారు. అమరవీరుల సంస్మరణకు 24న చింతూరులో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపిటిసి పూనం. ప్రదీప్‌కుమార్, పంకు సత్తిబాబు పోడియం శ్రీరామ్మూర్తి, తోడం రాజు, కొండారెడ్డి, సీరపు.తాతబాబు, కమ్మచిచ్చు సత్యనారాయణ, గొంది ధారయ్య, గుండుపూడి లక్ష్మణరావు, ఖాదర్, ఆత్మకూరు కాంతారావు, నేరిపోయిన రాజు, వీర్ల.నాగేశ్వరరావు, నాలారపు ప్రకాశరావు, జంగం మాధవరావు, ప్రజానాట్యమండలి నాయకులు సుబ్బారావు, జంగం మోహనరావు, దారోగి బాబూరావు, కళ్లి.గణేష్, రవి పాల్గొన్నారు..



సదస్సుల ద్వారా ప్రచారం చేస్తున్న సిపిఎం శ్రేణులు

ఔషధ మొక్కలపై అవగాహన



ఔషధ మొక్కలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న చిరంజీవి

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మండలంలో జిఎంవలస పంచాయతీ గొందివాడ, పాటే, నెల్లూరు, దొలగంది గ్రామాలకు చెందిన గిరిజనులకు గురువారం గొందివాడ గ్రామంలో ఔషధ మొక్కలపై అవగాహన కల్పించారు. నేషనల్ మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు, ఆర్‌సిఎఫ్‌సి, సదరన్ రీజియన్, ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు, విజయవాడ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిం చిన సదస్సులో ఎన్ఎంపిబి ప్రతినిధి పి చిరంజీవి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అందుబాటులో ఉన్న ఔషధ మొక్కల, సాగు, ఉపయోగాలు వివరించారు.ఎపి మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు ప్రతినిధి ఎం.విజయకుమార్ మాట్లాడుతూ ఔషధ మొక్కల విలువలు, మార్కెటింగ్ సదుపాయాలు వివరించారు బోర్డు తరఫన ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గోడౌన్స్, ప్లాట్‌ఫారాలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. వనవాసి ఎన్‌జిఒ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఎఫ్ఎస్ఒ వెంకటరమణ, గాంధీ బాబు విలేజ్ ఆర్టికల్చర్ అసిస్టెంట్, రాజు, బాటనిస్ట్, సుధాకర్, ఈ మిస్ ఇండస్ట్రీ, విజయవాడ, అనుదీప్ కుమార్ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి -ఎటపాక : ప్రజల్లో విస్తృత అవగాహన, చైతన్యంతోనే బాల్యవివాహాల నిర్మూలన సాధ్యమని ఎంపిడిఒ మీనాక్షి, ఎంఇఒ రాజులు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సిడిపిఒ పి.అరుణ అధ్యక్షతన మండల, గ్రామ స్థాయి బాల్య వివాహాల నిర్మూలన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి నెలా మొదటి శుక్రవారం గ్రామస్థాయి అవగాహన కార్యక్రమాల్లో స్థానిక అధికారులు పాల్గొనాలని సూచించారు బాల్య వివాహాల నిర్మూలన, ఫోస్కో చట్టాలపై ఎస్ఐ అప్పలరాజుఅవగాహన కల్పించారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై విస్తృతప్రచారంతో అందరికీ తెలియజెప్పాలన్నారు. బాల్య వివాహ రహిత గ్రామాలు నిర్మించాలని తీర్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

గుడి, బోర్‌వెల్ చెంతన మరుగుదొడ్ల నిర్మాణం వద్దు

ప్రజాశక్తి -సీలేరు: స్థానిక ఎపి గురుకుల పాఠశాల ఆవరణ సమీపంలో ఉన్న వినాయకుడి గుడి, బోర్‌వెల్స్ సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టొద్దని గురుకులం ప్రిన్సిపల్ బుచ్చిబాబు కోరారు. గురువారం ఎపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

సీలేరు కాంప్లెక్స్ పరిధిలో స్థానిక జలవిద్యుత్ కేంద్ర సమీపాన పార్వతీనగర్ వద్ద మొదటి విడతలో 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డుస్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులొచ్చిన సంగతి తెలిసిందే. టెండర్లు దక్కించుకున్న మేఘా కంపెనీ ఇంజనీర్లు, సిబ్బందికి వసతి సముదాయాలకు గురుకుల పాఠశాల సమీపంలో స్థలాన్ని జెన్కో అధికారులు కేటాయించారు. ఆ ప్రదేశంలో మేఘా కంపెనీ వసతి సముదాయాల నిర్మాణం చేపడుతోంది. ఇందులో భాగంగా గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న వినాయకగుడి, బోర్‌వెల్స్ సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణానికి తలపెట్టడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. బోరువెల్ సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణంతో నీరు కలుషితమై విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వాపోయారు.



జెన్‌కో ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిబాబు

అలాగే వినాయక గుడి సమీపంలో టాయిలెట్ల నిర్మాణం సరికాదని వాపోతున్నారు. బోరువెల్, గుడి సమీపంలో కాకుండా వేరేచోట మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు.

దీనిపై జెన్‌కో ఎస్ఇ, సివిల్ చంద్రశేఖర్ రెడ్డి స్పందిస్తూ, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వేరేచోట మరుగుదొడ్లు నిర్మించేలా కాంట్రాక్టింగ్ కంపెనీ ప్రతినిధులకు ఆదేశిస్తామన్నారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసానిచ్చారుకార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న సర్పంచులు

ఆర్థిక సంఘం నిధులను జమ చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాలని సర్పంచుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కొర్రా త్రినాథ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం 23 గ్రామ పంచాయతీ సర్పంచ్లు, ఉప సర్పంచ్ లతో మండల ఎంపిడిఓ సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రెండు విడతలగా 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు 958 కోట్ల రూపాయలు స్థానిక సంస్థల కోసం విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ప్రధాన ప్రాధాన్యతగా మంచి నీరు, డ్రైనేజీ, సిసి రోడ్లు, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులకు కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించడంతో గ్రామ పంచాయతీలను అభివృద్ధి కాకుండా చేసిందని తెలిపారు. సర్పంచులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆర్థిక సంఘం నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలనీ,ప్రతి నెల సర్పంచులకు గౌరవ వేతనం 10 వేల ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎస్.సుభాష్, ఎస్.నర్సింగ్‌రావు, కె.శివ శంకర్, డి.నీలకంఠం పాల్గొన్నారు.


తారురోడ్డు మంజూరు పత్రం అందజేస్తున్న దృశ్యం

తారురోడ్డు మంజూరు

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని అంతర్ల పాతవీధి జాతీయ రహదారి 516ఈ నుంచి చుంచుపూడి, బుడతల వేనం గ్రామాలను కలుపుతూ దాదాపు నాలుగు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.112 లక్షల నిధులు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆమోదం తెలిపినట్లు టిడిపి చింతపల్లి గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి కొర్రాబు గాంధీ పడాల్ తెలిపారు. పాడేరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా వెంటనే స్పందించి రోడ్డు నిధుల విడుదలకు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ జేఈ బాల కిషోర్ చేతుల మీదుగా టిడిపి చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు నిధుల మంజూరు ధ్రువపత్రం స్వీకరించారు. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రహదారి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో నిబంధనలు ఉల్లంఘిస్తూ జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ శాఖ స్పందించింది. స్థానికంగా టీ టైం వెనుక భాగంలో ఓ గిరిజనేతరుడు అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని పత్రికల్లో వరుస కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు వీఆర్వోతో పాటు రెవెన్యూ సిబ్బంది బుధవారం అక్రమ నిర్మాణాన్ని పరిశీలించింది. నిర్మాణ పనులను నిలిపివేశారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు అనుమతులు లేకుండా కట్టడాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు తెలిపారు.

శరభగుడలో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకువేలి మండలంలోని పెదలబుడు పంచాయతీ పరిధిలోని శరభగుడ గ్రామంలో గత కొన్ని రోజులుగా చెత్త చెదారం పేరుకు పోయింది. చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో పాటు దోమలు, కీటకాలు పెరగడంతో గ్రామస్తులు ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. గురువారం శరభగుడ క్లస్టర్ పేసా ఉపాధ్యక్షుడు కిల్లో జగన్నాథం, కొర్ర మగ్గన్న, కిల్లో సహదేవ్‌తో పాటు గ్రామస్తులు చెత్తకుప్పలు ఉన్న చోటును పరిశీలించారు. పంచాయతీ అధికారులు చెత్తను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.గ్రామానికి దగ్గరలో ఉన్న చెత్తకుప్పలతో రోజువారీగా రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. దుర్వాసన తట్టుకోలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన స్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం స్పందించి చెత్తను తొలగించి, ఆ ప్రాంతంలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలంటూ పంచాయతీ సిబ్బందిని గ్రామస్తులు కోరారు.


చెత్తను పరిశీలిస్తున్న గ్రామస్తులు

విభిన్న ప్రతిభావంతులకు స్కూటీల మంజూరు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని అర్హులైన విభిన్నప్రతిభా వంతులకు నియోజకవర్గానికి 10 చొప్పున మోటారు మూడు చక్రాల వాహనాలను (స్కూటీలు) మంజూరు చేయనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక విభిన్న ప్రతిభావంతుల రాకపోకల సౌలభ్యం కోసం స్వయం ప్రతిపత్తిని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం వీటిని పంపిణీ చేస్తోందని ఆమె చెప్పారు ఈ వాహనాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అర్హులు www.apdascac.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 25 తుది గడువు అని తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే దివ్యాంగులు ఈ క్రింది నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. దరఖాస్తు తేదీ నాటికి 18 సంవత్సరాల పైబడి 45 సంవత్సరాల లోపు ఉండాలని, సదరం ధృవీకరణ పత్రం ప్రకారం కాళ్లలో (లోయర్ లింబ్స్) వైకల్యం 70శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగి ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం గరిష్ఠంగా మూడు లక్షలు మించ కూడదన్నారు. మోటార్ వాహన చట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అన్నారు. అభ్యర్థి పేరు మీద సొంతంగా రెండు/మూడు/నాలుగు చక్రాల మోటరైజ్డ్ వాహనం ఉండకూడదన్నారు. సహాయక పరికరం లేకుండా నడవగలిగే వ్యక్తులు ఈ పథకానికి అనర్హులని చెప్పారు. వేతనం పొందుతూ కనీసం ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారు సంబంధిత ధృవీకరణ పత్రాన్ని తప్పక జతపరచాలన్నారు. గతంలో చేసిన దరఖాస్తులు పరిగణలోకి తీసుకోబడవని, అర్హులైన అందరూ ఇప్పుడు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మోసపోకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

సంస్థ సేవలకు సహకరించండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఏజెన్సీలో మలేరియా, టైఫాయిడ్, ఇతర సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు షేరీన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిలింగ్ సిబ్బంది చేస్తున్న సేవలకు సహకరించాలని సంస్థ ప్రతినిధులు కోరారు. గురువారం స్థానిక ఎంపిడిఒ యాదిగిరిశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. తమ సంస్థ ద్వారా మన్యవాసులకు వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు టైఫాయిడ్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తున్నామన్నారు. దీనిపై ఎంపిడిఒ స్పందిస్తూ ఏజెన్సీ వాసులకు వ్యాధులపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు అయితే టైఫాయిడ్ వ్యాక్సిన్ వేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి ఉంటే స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది సహకారంతో వేయొచ్చన్నారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుష్మ, ఇతర సిబ్బందిని సమన్వయం చేసుకుని వైద్యశిబిరాలను నిర్వహించాలని సూచించారు కార్యక్రమంలో సంస్థ రంపచోడవరం డివిజన్ బోర్డు సభ్యులు నరసింహ రెడ్డి, రాజవొమ్మంగి, అడ్డతీగల సూపర్‌వైజర్‌లు రాజుబాబు, మండల కోఆర్డినేటర్ ఎస్ శోభన్ బాబు, ఫీల్డ్ ఆఫీసర్ సింహాచలం, నరేంద్ర పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అన్నదాత సుఖీభవ పథకం, పిఎం కిసాన్ ద్వారా మండలంలోని 5.490 మంది రైతుల ఖాతాల్లో రూ 3.75 కోట్లు జమైనట్లు స్థానిక అగ్రికల్చర్ అధికారి చక్రధర్ తెలిపారు పిఎం కిసాన్ ద్వారా రూ 2వేలు, అన్నదాత సుఖీభవ ద్వారా రూ 5వేలు చొప్పున రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సహాయం మంజూరు చేసిందని తెలిపారు. ఆయా నిధులను రైతులు వ్యవసాయ అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొయ్యూరు: మండలంలో9,815 మంది రైతుల ఖాతాల్లో అన్నదాతా సుఖీభవ, పిఎం కిసాన్ నిధులు రూ.6.79 కోట్లు జమయ్యాయని మండల వ్యవసాయాధికారి బి.రాజ్‌కుమార్ తెలిపారు. చీడిపాలెం రైతు సేవా కేంద్రంలో ఎంపిపి బడుగు రమేశ్, స్థానిక సర్పంచులు సోమన్నదొర, పీటా సింహాచలంతో కలిసి అన్నదాత సుఖీభవ పథకం కార్యక్రమంలో పాల్గొన్నారు

చిన్నపిల్లల మందులు వితరణ

ప్రజాశక్తి-చింతూరు

శీతాకాలంలో ఆరోగ్య సేవలను బలోపేతం చేసేందుకు సమారిటన్స్ ఫర్ ద నేషన్ స్వచ్ఛంద సంస్థ రూ. 80 వేల విలువైన చంటి పిల్లలకు కావలసిన ఆరోగ్య మాస్కులు, పీడియాట్రిక్స్ నెబిలైజర్లు, పామ్ ఇంజక్షన్లు, డివార్మింగ్ మందులు అందజేశారు. ఏజెన్సీలని ఆరోగ్యకేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు అందజేసేందుకు వీటిని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.పుల్లయ్యకు అందజేశారు.

నేరాలు ఘోరాలు

వరి కుప్ప దగ్ధం


ఆదేవన వ్యక్తం చేస్తున్న రైతు

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని మారు మూల పెద్దకోట పంచాయతీ కొర్రపర్తిలో పెంటయ్య వరి కుప్ప దగ్ధమైంది. పంట పొలాల సమీపంలో కుప్ప వేశాడు. బుధవారం అర్ధ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా ఖాళీ బూదైంది. గురువారం తెల్లవారు జామున చూడగా ఖాళీ బూడిదై ఉండడంతో రైతు లబో దిబోమన్నాడు. తుఫానుకు నష్టపోయిన అనంతరం మిగిలిన వరిని కోత అనంతరం కుప్ప వేశానని తెలిపాడు. కూటమి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరాడు.

చోరీ కేసులో నిందితునికి జైలు శిక్ష

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని శోభకోట గ్రామానికి చెందిన రవణమ్మ తన మనవరాలిని తీసుకు రావడానికి ఇంటి వద్ద నుంచి వీధి చివరకు వెళ్లిన సమయంలో అదే గ్రామానికి చెందిన కాకరి రాంబాబు చోరీకి యత్నించాడు. సీఐ సన్యాసి నాయుడు కథనం మేరకు.. రవణమ్మను బలవంతంగా తన ఇంటి లోపలికి తీసుకువెళ్లి ఆమె ధరించిన బంగారాన్ని దొంగలించడానికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించగా రాంబాబు కోపంతో స్టీల్ గ్లాస్, గరిటెతో ఆమె ముఖం, తలపై దాడి చేసి, బంగారు పుడకను దొంగలించి పరారయ్యాడు. గాయపడిన రవణమ్మను కుటుంబ సభ్యులు పాడేరు ఆసుపత్రికి తరలించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు హుకుంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, 3.12.2024న రాంబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కేసు విచారణ అనంతరం పాడేరులో జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నిందితుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 2,000 జరిమానా విధించారు.

మినీ అంగన్వాడీ కార్యకర్త మృతి


రాజులమ్మ (ఫైల్)

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని తాళ్ళకోట గ్రామంలో మినీ అంగన్వాడీగా విధులు నిర్వహిస్తున్న సాగిన రాములమ్మ కడుపు మంటతో మృతి చెందిన సంఘటన చింతపల్లి మండలంలోని తాజంగి పంచాయతీ తాళ్ళకోట గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గురువారం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు సరుకులు పంపిణీ చేస్తుండగా ఒక్కసారిగా కడుపులో మంట రావడంతో కుటుంబ సభ్యులు చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉంది నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మడిగుంట గ్రామ సమీపం వద్ద ఊపిరాడక మృతి చెందారు. రాములమ్మ మృతితో తాళ్ళకోట గ్రామంలో విషాద ఛాయాలు అలుముకున్నాయి. సహచార ఉద్యోగస్తులు సమాచారం తెలుసుకుని సంతాపం తెలియజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రథమ సంవత్సర ప్రవేశాల కోసం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో నెల 22లోపు కళాశాలకు హాజరవాల్సిందిగా కోరారు. బీకాం, బిఎస్సీ (జూలాజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్) గ్రూపుల్లో మాత్రమే సీట్లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9493801827, 8500406280 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డిఇఇ జ్యోతిబాబు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన మద్దిల బూసికొండ రహదారి పనులను పంచాయతీరాజ్ డిఇఇ జ్యోతి బాబు గురువారం పరిశీలించారు. గాలికొండ నుంచి బూసికొండ వరకు నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.నాలుగు కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. రహదారి పనుల నాణ్యతపై పరిశీలించి, కాంట్రాక్టర్‌కు తగు సూచనలు చేశారు. ప్రస్తుతం మెటల్ రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే బిటి రోడ్డు పనులు చేపడతామని డిఇఇ జ్యోతి బాబు అన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ


సంతకాల సేకరణలో వైసిపి నేతలు

ప్రజాశక్తి గంగవరం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనే చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, లేకుంటే ఊరుకోబోమని వైసిపి మండల అధ్యక్షులు వై.వెంకటేశ్వర రావు హెచ్చరించారు.. గురువారం మండలంలోని సూరంపాలెం, కార్యక్రమంలో ఎంపిపి పల్లాల కృష్ణారెడ్డి, జెడ్‌పిటిసి గొల్లపల్లి బేబిరత్నం, వైస్ ఎంపిపి 2,కుంజం గంగభవాని, ఎంపిటిసి కుంజం పద్మావతి, సర్పంచులు శివ, శారపు కామరాజు, బండారు రామలక్ష్మి, మరిడమ్మ, పార్వతి, నాయకులు సూరంపూడి ఏడుకొండలు, చక్రి, జడేరు శివ, బైరా బాబీ, పీర్ల శ్రీను, నిడమర్తి రమేష్, చవలం సింగారమ్మ,పాల్గొన్నారు

నాటు వైద్యం జోలికి పోవద్దు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రమీల

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: నాటువైద్యం వలన ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని, గ్రామాల్లో బాలింతలు, రోగులు నాటు వైద్యం జోలికి పోవద్దని అవగాహన కల్పించాలని అంగన్వాడీలకు జడ్డంగి ఆసుపత్రి ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ప్రమీల తెలిపారు. గురువారం జడ్డంగి అంగన్వాడి కేంద్రంలో సమావేశంలో మాట్లాడుతూ బాలింతలకు నాటువైద్యం వలన కలిగే నష్టాలు వివరించారు బాలింతలకు వాత నొప్పులు, గర్భాశయ బలానికి, బాలారిష్ట, దశమూలారిష్ట, తదితర వాటికి జడ్డంగి పిహెచ్‌సిలో ఆయుర్వేద మందులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు అమ్మిరాజు, వీరయ్యమ్మ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ పడి గిరిజనుడు మృతి


మృతుడు రమణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోనిచికిలింత గ్రామానికి చెందిన బండారు రమణ (51) అనే గిరిజనుడు గురువారం కట్టెలు కొడుతుండగా ప్రమాదవశాత్తు ఎండినకొమ్మ విరిగి మెడపై పడడంతో రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతురాలి భార్య చిన్నబుల్లి ఫిర్యాదు మేరకు జడ్డంగి ఎస్ఐ చినబాబు ఆధ్వర్యంలో ఎఎస్ఐ. విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ఆసుపత్రికి తరలించారు. రమణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మొరాయిస్తున్న బస్సులతో పరేషాన్!

సాంకేతిక సమస్యలు సరేసరి...డీజిల్ లేక బస్సు ఆగిపోవడంపై ప్రయాణికుల ఆగ్రహం

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరుకు వచ్చిపోయే బస్సులు తరచూ వివిధ కారణాలతో మొరాయిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి సాంకేతిక సమస్యతో ఒక బస్సు ఆగిపోయా, గురువారం డీజిల్ లేకపోవడంతో మరో బస్సు మొరాయించడంతో నడిరోడ్డుపైనే జనం పడిగాపులు పడే పరిస్థితి నెలకొంది. ఏజెన్సీకి వచ్చే అరకొర బస్సుల్లో ఇలా ఎక్కడికక్కడే ఆగిపోతే, తాము గమ్యాలు చేరుకునేదెలాగని మన్యవాసులు, ప్రయాణికలుఉ మండిపడుతున్నారు.

డీజిల్ లేని నిలిచిన బస్సు

గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు భద్రాచలంలో బయలుదేరి వయా చింతూరు మోతుగూడెం మీదగా సీలేరు ఉదయం 10 గంటలకు చేరుకుని విశాఖ వెళ్లే విశాఖపట్నం డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీస్ సీలేరుకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఐస్‌గెడ్డ దాటిన తర్వాత ఎర్రదిబ్బలు వద్దకు వెళ్లేసరికి అర్ధాంతరంగా నిలిచిపోయింది. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బస్సు ఆగిపోవడానికి కారణమేంటో పరిశీలించగా, ట్యాంకులో డీజిల్ అయిపోయినట్లు గుర్తించారు. దీంతో మార్గమధ్యంలో 20 మంది ప్రయాణికులు గంటన్నర పాటు పడిగాపులు పడ్డారు. ఆర్‌టిసి సిబ్బంది వెంటనే సీలేరు వెళ్లి ఆటోలో డీజిల్ తెచ్చి బస్సులో పోసి, గమ్యం వైపు వెళ్లారు. డిపో నుంచి బయలుదేరినప్పుడు బస్సులో సరిపోయే డీజిల్ ఉందా లేదా చూసుకోవాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు మండిపడుతున్నారు. దీనిపై డ్రైవర్‌ను ప్రశ్నించగా, ఆర్ నగర్ నుంచి పాలగెడ్డ వరకు నిండా గోతులమయమైన రోడ్డులో ఎక్కువసార్లు గేర్లు మార్చాల్సిన స్థితిలో డీజిల్ వాడకం ఎక్కువవ్వడం వల్లే ఆగిపోయిందని అంటున్నారు.

బ్రేకులు ఫెయిలై మరో బస్సు...

భద్రాచలం నుంచి సీలేరు మీదగా విశాఖపట్నం వెళ్లే నైట్ బస్సు కూడా క్లచ్ సిలిండర్‌లో సాంకేతిక లోపాలు తలెత్తి బ్రేకులు పట్టకపోవడంతో బుధవారం రాత్రి 11 గంటలకు సీలేరులో నిలిచిపోయింది. బుధవారం సాయంత్రం 5గంటలకు భద్రాచలంలో బయలుదేరి మోతుగూడెం డొంకరాయి మీదగా వస్తుండగా సీలేరుకు రెండు కిలోమీటర్ల దూరంలో బ్రేకులు పట్టకపోవడంతో నిలిచిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా నడిపి ప్రయాణికులతో సీలేరు సురక్షితంగా చేరుకున్నారు. స్థానిక మెకానిక్ ఈశ్వరరావు పరిశీలించగా క్లచ్ సిలిండర్‌లో సమస్యతో బ్రేకులు పట్టడం లేదని గుర్తించారు.ఆర్‌టిసి అధికారులకు సమాచారమివ్వగా, వారి సూచనల మేరకు వేరే బస్సులో ప్రయాణికులను విశాఖకు చేర్చారు.


ఎర్రదిబ్బల వద్ద ఆగిపోయిన బస్సుకు డీజిల్ పోస్తున్న ఆర్‌టిసి సిబ్బంది

ప్రయాణికులు ఆందోళన

ఏజెన్సీలోని ఘాట్‌రోడ్డులో కండిషన్ లేని బస్సులను నడపడం వలన తరచూ మరమ్మతులు గురవుతున్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.. దట్టమైన అటవీ ప్రాంతంలో బస్సులు ఆగిపోతే ప్రయానికుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. కండిషన్ కలిగిన బస్సులను ఏజెన్సీ ప్రాంతంలో నడపాలని కోరుతున్నారు.

పరిశుభ్రతలో మహిళలదే కీలకపాత్ర


శిక్షణలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి-కొయ్యూరు : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో మహిళలు కీలకపాత్ర పోషించాలని ఎంపిడిఒ జిడివి. ప్రసాదరావు, డిప్యూటీ ఎంపిడిఒ బాబూరావు కోరారు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలు, వెలుగు విఒఎలకు క్లీన్ విలేజ్ అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి ఇంట్లో చెత్తబుట్టలో వేసి పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులు దరిచేరవన్నారు. క్లీన్ విలేజ్ సాధనలో మహిళలందరూ గట్టి సంకల్పంతో కృషిచేస్తే సాకారమౌతుందన్నారు. మన ఇల్లు మన వీధి మన గ్రామం అలా అనుకొని శుభ్రతతో మెలగాలని సూచించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ


పతకాలతో ఏకలవ్య విద్యార్థులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అరకు వ్యాలీలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఈనెల 19న జరిగిన సర్ అస్మిత ఖేలో ఇండియా మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పాల్గొన్న 19 మంది విద్యార్థినులు 12 పతకాలను సాధించారు. వీటిలో 6 బంగారు, 4 రజత, 2 కాంస్య పతకాలు ఉన్నాయని ప్రిన్సిపల్ కృష్ణారావు గురువారం తెలిపారు. విజేతలను ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


విఆర్.పురంలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ప్రజాశక్తి: విఆర్ పురం: కూనవరం శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు లైబ్రేరియన్ మాదేటి గోవిందరాజులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎడవల్లి కన్యకాపరమేశ్వరి, మాజీ జెడ్‌పిటిసి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ రిటైర్డ్ హెచ్ఎం ఎన్ వెంకటస్వామి, గ్రంథాలయ కమిటీ వైస్ ప్రెసిడెంట్ హెచ్ రవి, ఉన్నత పాఠశాల పీడీ కె. అరుణ, విజయ సాధన హైస్కూల్ హెచ్ఎం బి రమాదేవి, ఉపాధ్యాయురాలు దివ్య భవాని, వీరన్న, కెవిఐఎస్ నారాయణ చెరుకూరు సుబ్బారావు,ఎ. వీర్రాజు పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు అలరించాయి. చెరుకూరి సుబ్బారావు దేశభక్తి గీతాలు ఆలాపించారు వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠకులు కాచవరం బిడిసి నిర్వాహకుడు సూదిపాక శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిసాయి. ప్రిన్సిపల్ డాక్టర్. కె రత్నమాణిక్యం అధ్యక్షతన సభలో గంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు. చింతూరు శాఖాగ్రంథాలయాధికారి ఎం. గోవిందరాజులు గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తక పఠన ఆవశ్యకతను వివరింఆచరు.. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎమ్. శేఖర్ మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయంలో డిగ్రీ పాఠ్య పుస్తకాలతో పాటు వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్థశాస్త్ర విభాగాధిపతి జి.వెంకటరావు మాట్లాడుతూ కష్టంగా కాకుండా ఇష్టంతో పుస్తకపఠనం చేయాలన్నారు. అనంతరం గ్రంథాలయాల ఆవశ్యకత, పుస్తక పఠనంపై ప్రతిజ్ఞ చేశారు. వక్తృత్వ, వ్యాసరచన,పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కళాశాల గ్రంథాలయ ఇన్చార్జ్ బి. సంగంనాయుడు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్. వై. పద్మ, కె. శైలజ, ఎం. నాగమోహనరావు, జి. సాయికుమార్, బి. శ్రీనివాసరావు, ఆర్. మౌనిక, ఎన్.ఆనంద్, కె.ఎల్ ప్రసన్నకుమారి, కె. కీర్తి, విద్యార్థులు పాల్గొన్నారు


చింతూరు డిగ్రీ కాలేజీలో అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళులు


డుంబ్రిగుడలో బహుమతులు ఇస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

డుంబ్రిగుడ: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల, బాలికల పాఠశాల, బాలుర పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థుల ఆట పాటలతో ఘనంగా జరిగింది. ఈ వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 14 నుంచి 19 వరకు విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఎంపీడీవో ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ, గ్రంథాలయాలను ప్రతి ఒక్క విద్యార్థి ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ప్రభుదాస్, గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత, ఓఎస్ సుబ్బారావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.